# ఆదర్శాలు ఖర్చు పెట్టి...?

మధ్యాహ్నపువేళ రిక్షాదిగి యింట్లోకి వచ్చాడు కేశవరావు. బియ్యం ఏరుకుంటున్న భార్యా, లేసు అల్లుకుంటున్న కూతురు కనబడ్డారు. హాల్లో. ఉత్తరీయం వంకెన తగిలిస్తూ "విన్నావా సుపుత్రుడిఘనకార్యం? యివాళ లెఖ్ఖలట-అరగంటరాసి పేపరిచ్చేసి వచ్చాడట. ఏడీ యింటి కొచ్చాడా అసలు?" అన్నాడు భార్యతో. ఆ యిల్లాలు ఏమాత్రము తొణకనిదై ఏరిన బియ్యం యింకో చేటలో పోస్తూ "ఆఁ వచ్చాడు. చెప్పాడు. భోంచేసి యిప్పుడే బైటకెళ్ళాడు" అంది.

"ఎంత దర్జాగా చెప్తున్నావు? చీమకుట్టినట్లన్నా లేదేం నీకు?" ఉక్రోషంగా అన్నాడు!

"క్రిందటి సెప్టెంబరప్పుడే చెప్పాడు వాడు. పేపర్లు ఎక్కడికెళ్ళాయో కనుక్కోమని. చదివి, రాసి పాసవ్వలేనని ఖచ్చితంగా చెప్పేడుగదా! ఇప్పుడు అరుచుకుని ఏం లాభం?" ఇదీ ఆవిడ జవాబు!

కేశవరావుకు భార్య ప్రకృతి ఎంత తెలిసిందే అయినా ఎప్పటికప్పుడు ఆమె ప్రవర్తన అతనికి వింత గొలుపుతునే వుంటుంది. అతని అభిమానం పూర్తిగా దెబ్బతిన్నది. అశాంతిగా "ఆమాట అనడానికి వాడికి అభిమానం లేకపోయింది, కాని నన్ను గురించి ఏమిటనుకుంటు న్నావు నువ్వు" అని అరిచాడు. అలాంటి అరుపులకు అలవాటు పడింగానిలా ఏమాత్రం బెదిరి పోకుండా నిదానంగా లోపలకు వెళ్ళింది గృహిణి. హాల్లో మూలగా కూర్చుని యింకా లేసు అల్లుకుంటూనే

వుంది కూతురు. పెళ్ళికాని కూతురెంత బరువో, చదువురాని కొడుకూ అంతబరువు. ఇహ పెళ్ళి. చదువూ రెండూ లేని అమ్మాయి డబల్ బరువు. కేశవరావు పడక్కుర్చీలో వాలి కళ్ళుమూసుకున్నాడు. కూని రాగం తీసుకుంటూ లోపలికొచ్చిన కుమార రత్నం తండ్రినిచూసి గదిలోకి వెళ్ళాడు. సినిమాపత్రి కేదో చేతబట్టుకుని యింటి కొచ్చిన కొడుకును పల్కరించ బుద్ధికాలేదు కేశవరావుకు. తన కొడుకే కానట్లుగా నిర్లిప్తతగా చూసి వూరుకున్నాడు.

ఈ కేశవరావు యిరవై ఏళ్ళ క్రితం పట్నంలో కాలేజిలో చదువుకుంటూ, నవ్వుతూ పేలుతూ వుండే ఆ కేశవరావు కాడు. ఉదాత్తమైన గ్రంథాలు చదివాడు. ఉన్నతమైన ఆదర్శాలు పెంచుకున్నాడు. వాటిని గురించి ఎన్నోకలలు కన్నాడు. మరి ఆ కేశవరావే యీ కేశవ రావు ఎట్లా కాగలడు? అయితే, ఆ ఆదర్శాలన్నీ ఏమయినట్లు? యీ భార్య, యీ పిల్లలు, యిటువంటి గృహ జీవితం- యిదా అతని చదు వుకు రాణింపు.

ఆ రోజుల్లో మెద్రాసులో కేశవరావుకు ఉమాపతి ఆప్త మిత్రుడు, అతని యింటికి తరచూ వెళ్తూవుండేవాడు. ఉమాపతి చెల్లెలు రమణి మరపురాని మహిళ చిన్నప్పుడే కుంకుమకు కరువై పోయిన పిల్ల! ఎప్పుడైనా కంటబడ్డా మెరుపులా మాయమయ్యే అమ్మాయి. తల ఆర బెట్టుకుంటూనో, తడిబట్టలు ఆరవేస్తూనో ఆమె పాడుకునే పాటలు ఏవో దివం. పరిమళాల్లా గాలిలో కలసివచ్చి అతన్ని ఆవరించేవి.

"గగనానీ కిలకూ బహుదూరం బనినాడో-"

అత డెంతగా కరిగి పోయాడా పాటకు! జాలితో తడిసిపోయిన అతని అంతరంగం ఎన్నో ఆదర్శాలను వూహించింది. సాహసించాలనే సంకల్పానికి అతని నెత్తురు పొంగిపోయింది. చిన్నగా నవ్వుకున్నాడు. కలలు కన్నాడు.

ఆ తర్వాత సెలవలకని యింటి కెళ్ళాడు. ఇంటి కెళ్ళగానే "నీ కోసమే ఎదురు చూస్తున్నాము. అంతా సిద్ధమైంది. పనులు మొదలు పెట్టాం. యింకా పదిహేను రోజులే!" అన్నాడు తండ్రి. ఏమీ అర్థం కాక "ఏంటి నాన్నా?" అన్నాడు. యీ మధ్య మీ మావయ్య వచ్చి వెళ్ళాడు. అందరికి యిష్టమే నన్నాం" అన్నా డాయన. కేశవరావు తెల్ల బోయాడు? చల్లబడిపోయాడు. తెమల్చుకుని "నా కిష్టం లేదు నాన్నా" అన్నాడు. తండ్రి ఆశ్చర్యపోయాడు. తల్లి ఏడుస్తూ "పుట్టింటి ఋణం తీరిపోయింది నాకు. యిహ ఏముఖం పెట్టుకుని ఆ యింటికి వెళ్ళగలను నేను" అన్నది. ఆ సాయంత్రం తండ్రి కొడుకును సమీపించి "మన కష్టంలో ఎంతగానో ఆదుకున్నాడు మీ మావయ్య. ఆలోచించు" అన్నాడు. పిచ్చెక్కినంతయ్యింది కేశవరావుకు. ఉద్వేగంగా "మీ యిష్టం నాన్నా" అన్నాడు. తండ్రి కళ్ళు గర్వంతో మెరిసాయి. తల్లి ముఖం చేటంత చేసుకుంది. నెల తిరక్క ముందే గృహస్థు డయ్యాడు. కేశవ రావు. ఎవరి సంతోషానికి తన ఆదర్శాలు బలి చేశాడో ఆ తల్లిదండ్రులు ఆ తర్వాత కొద్ది కాలానికి లేకుండా అయిపోయారు. ఆదర్శాలు ఖర్చు పెట్టి చివరకు తను సాధించిం దేమిటి అనుకున్నాడు కేశవరావు. కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా ఏనాడూ తన మానసిక జీవితంలోకి తొంగైనా చూడని భార్యా, పెళ్ళికాని కూతురు, చదువురాని కొడుకూ కనబడ్డారు!

—o—